క్లుప్తంగా

నేటి 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాలు

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణ పరిధిలోని 12, 36 వార్డులలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు ఒక గురువారం ప్రకటనలో తెలిపారు. 12వ వార్డు చినరావూరు-1 సచివాలయం వద్ద ఉదయం 11 గంటలకు, 36వ వార్డు గంగానమ్మపేట-2 సచివాలయాల వద్ద మధ్యాహ్నం 3గంటలకు సభలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే సచివాలయాలలో సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలు తెలియజేసే బోర్డులను ఆవిష్కరించనున్నట్లు వివరించారు. కౌన్సిలర్లు, అధికారులు పాల్గొనాలని కోరారు.

ప్రారంభమైన వార్షిక బ్రహ్మోత్సవాలు



తెనాలిరూరల్: పెదరావూరులోని సుబ్రహ్మణ్య స్వామి దేవస్థాన వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. తొలి రోజు గణపతి పూజ, కలశస్థాపన, మండపారాధన, ధ్వజారోహణం నిర్వహించారు. ఉదయం 9 గంటలకు స్వామి వారికి తిరుమంజన సేవ చేశారు. సాయంత్రం అగ్ని ప్రతిష్ఠాపన, గణపతి హోమం, దేవతా హోమాలు జరిపారు. ఐదు రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాల్లో స్వామి వారికి విశేష పూజలు, అర్చనలు జరుపుతామని శుక్రవారం చండీ హోమం, సువాసినీ పూజ నిర్వహిస్తామని ఆలయ నిర్వాహకుడు చింతపల్లి సుబ్రహ్మణ్య శాస్త్రి తెలిపారు.

ఘనంగా జెండా పండగ



తెనాలిటౌన్: నందుల పేటలోని జెండా చెట్టు దగ్గర గ్యార్మీ జెండా పండగ సందర్భంగా షేక్ నసీమ్ ఆధ్వర్యంలో గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ప్రారంభించారు. గత పదహారు సంవత్సరాల నుంచి గ్యార్మీ జెండా పండుగను చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఇమ్మానే మజ్లిస్ కమిటీ సభ్యుడు షేక్ ఫరీద్, అడుసుమల్లి వెంకటేశ్వరరావు, మహ్మద్ ఖుద్దూస్, తాడిబోయిన హరిప్రసాద్, షేక్ ఇమ్రాన్, షేక్ తాజ్‌బాషా, షఫీ, మున్నీరు, షేక్ గుజూలు, సాయి, ఈదర పూర్ణచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

తాడేపల్లిరూరల్: మంగళగిరి రూరల్ పరిధిలోని రామచంద్రాపురంలో గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవాకి ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏ ఒక్క రైతు తన పంటని కనీస మద్దతు ధరకన్నా తక్కువకు అమ్ముకోవలసిన అవసరం లేకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు చేపట్టారని అన్నారు. దళారులు, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేస్తుందని రైతులకు వివరించారు. ప్రతి వరి సాగు చేసే రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. దుగ్గిరాల సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, మంగళగిరి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు జి.శ్రీనివాస్‌రెడ్డి, మంగళగిరి మండల వ్యవసాయ అధికారి జడ్.శైలజారాణి, వీఏఏలు ప్రశాంతి, రాజేశ్వరి, పౌర సరఫరా శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మహిళల కబడ్డీ జట్టుకు తృతీయ స్థానం

బాపట్ల అర్బన్: మహిళా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినులు 8 మంది నవంబరు 24న బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో జరిగిన కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబర్చారు. నవంబరు 29 నుంచి డిసెంబరు 1 వరకు కర్నూలులోని ఎమ్మిగనూరు పట్టణంలో అంతర్ జిల్లాల పోటీల్లో తృతీయ స్థానం సాధించారు. గురువారం బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థినులను అభినందించి, సర్టిఫికెట్లు, పతకాలు అందజేశారు. సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు, సెక్రటరీ మానం నాగేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ జి.దిలీప్ కుమార్, జాయింట్ సెక్రెటరీ కె. హరిప్రసాద్, ట్రెజరర్. టి.రామకృష్ణ, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్, రాము, అధ్యాపకులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

గుంటూరు ఈస్ట్: అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న ఇద్దరిపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. రామనామక్షేత్రం సమీపంలో గురువారం ఉదయం భాస్కరరావు, వెంకటశివనాగరాజు 400 కిలోల రేషన్ బియ్యం ఆటోలో తరలిస్తుండగా, సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేశారు. రేషన్ బియ్యం, ఆటోను స్వాధీనం చేసుకుని ఇద్దరిని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ.1,800 కోట్లతో సంక్షేమం

- ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- 40వ వార్డులో ముగిసిన 'గడప గడపకు మన ప్రభుత్వం'



మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిఅర్బన్: నియోజకవర్గంలో ఇప్పటి వరకు రూ.1,800కోట్లతో సంక్షేమ పథకాలు అందించినట్లు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని 40వ వార్డు జయప్రకాష్ నగర్ నుంచి గురువారం సాయంత్రం ప్రారంభించారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అత్తోట నాగవేణి, వైఎస్సార్ సీపీ నాయకుడు అత్తోట శ్యామ్ దంపతుల ఆధ్వర్యంలో వార్డు నాయకులు అధిక సంఖ్యలో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. వార్డులోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని తెలియజేసి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సంక్షేమానికి మొదటి ప్రధాన్యం, మౌలిక వసతుల కల్పన రెండో ప్రధాన్యంగా తీసుకోవడం జరిగిందన్నారు. ప్రజలు ఊహించిన దానికంటే ఎక్కువగా సంక్షేమాన్ని అందించినట్లు చెప్పారు. రాష్ట్రంలో కోవిడ్ విజృభించడంతో రెండు సంవత్సరాల పాటు ఎన్నో ఒడిదుడికుల మధ్య కూడా సంక్షేమాన్ని కొనసాగించినట్లు గుర్తుచేశారు. కోవిడ్ వల్ల రాష్ట్రంలో మౌలిక వసతుల కల్పన కొంత ఆలస్యమైందన్నారు. తెనాలి ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించి, అమలు చేస్తున్నట్లు చెప్పారు. తుపాను వల్ల నష్టపోయిన రైతులందరికి పరిహారం ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఒక్క ఎకరాన్ని కూడా వదలకుండా అందరికి సంక్రాంతి నాటికి పంట నష్టపరిహారాన్ని అందిస్తామని తెలిపారు. వైఎస్సార్ సీపీ తెనాలి పట్టణ క్లస్టర్ అధ్యక్షుడు మద్దాలి శేషాచలం, షేక్ దుబాయ్ బాబు, కౌన్సిలర్లు యాతాటి అనిల్, పేరం సంజీవ రెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు పెచ్చింగ్ సుభానీ, రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ మన్నవ ప్రభాకర్, వైఎస్సార్ సీపీ ప్రచార కమిటీ అధికార ప్రతినిధి నాలాది ప్రభాకర్, 40వ వార్డు నాయకులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన అజెండా

- మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక
- 13, 30, 31 వార్డుల్లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం



20వ వార్డులో సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరణ

తెనాలిఅర్బన్: పేదల సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రధాన అజెండా అని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని 35వ వార్డు గంగానమ్మపేట-1 సచివాలయం వద్ద గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా సంక్షేమ ఫలాలు అందిస్తున్నట్లు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్ సీపీకి పట్టం కట్టాలని కోరారు. వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ గడవర్తి శ్రీ సాయిహరేరామ్ మాట్లాడుతూ తన వార్డులో ఇప్పటి వరకు రూ.14.83 కోట్లతో సంక్షేమాన్ని అందించినట్లు చెప్పారు. అనంతరం సచివాలయంలో ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలు తెలియజేసే బోర్డును, జగన్ ఆంధ్రప్రదేశ్‌కు ఎందుకు అవసరం అనే బుక్‌లెట్‌ను చైర్ పర్సన్ ఆవిష్కరించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ తెనాలి పట్టణ క్లస్టర్-2 అధ్యక్షుడు షేక్ దుబాయ్‌బాబు, పార్టీ నాయకులు తాడిబోయిన పోలురాజు, తాడిబోయిన నాగరాజు, మున్సిపల్ మేనేజర్ అప్పలరాజు, మెప్మా సీఎంఎం మాధవరావు, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

- 20వ వార్డు పరిధిలోని సాలిపేట-2 సచివాలయం వద్ద వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ తెనాలి పట్టణ క్లస్టర్-1 అధ్యక్షుడు మద్దాలి శేషాచలం ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని తెలియజేశారు. ఈ వార్డులో ఇప్పటి వరకు రూ.16.50 కోట్లతో సంక్షేమాన్ని అందించినట్లు ఆయన వివరించారు. సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డు, బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కొల్ల గురునాథ గుప్తా, షేక్ గఫూర్, మున్సిపల్ మేనేజర్ అప్పలరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరం

- విద్యుత్, విజిలెన్స్ శాఖల ఆకస్మిక తనిఖీలు
- అదనపు లోడుపై రూ.7.78లక్షల జరిమాన
- ఈఈలు మూర్తి, చిరంజీవి



కొల్లిపరలో తనిఖీలు నిర్వహిస్తున్న విద్యుత్ అధికారులు

కొల్లిపర: విద్యుత్ వినియోగదారులు విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కేసు నమోదు చేసి, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవటం జరుతుందని విజిలెన్స్ శాఖ ఈఈ కె.వి.ఎల్.ఎస్ మూర్తి, తెనాలి డివిజన్ ఈఈ వి.వి.చిరంజీవి హెచ్చరించారు. గురువారం మండలంలోని వివిధ గ్రామాల్లో 65 బృందాలతో ఆకస్మికంగా గృహ, వాణిజ్య విద్యుత్ మీటర్లను తనిఖీ చేశారు. తనిఖీల వివరాలను ఈ సందర్భంగా వెల్లడించారు. 5,330 మంది సర్వీసులను తనిఖీ చేయగా వారిలో 182 మంది వినియోగదారులు అదనపు లోడు వినియోగిస్తున్నట్లు గుర్తించి, రూ.7,78,764లు, మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడుతున్న వినియోగదారులకు రూ.9వేలు జరిమాన విధించినట్లు తెలిపారు. ఏక్కడైనా విద్యుత్ చౌర్యానికి పాల్పడినట్లు తెలిస్తే 94408 12307, 94906 15533 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. నూతన విద్యుత్ మీటర్ల మంజూరు విషయంలో కూడా లైన్‌మెన్లు నిబంధనలు పాటించాలని, మల్టి పుల్ కనక్షన్లు మంజూరు చేస్తే విధుల నుంచి సస్పండ్ చేస్తామని మూర్తి హెచ్చరించారు. విద్యుత్ బిల్లులను కూడా ఖాతాదారులతో కట్టించాల్సిన బాధ్యత లైన్‌మెన్ల పైనే ఉందని, ఫీడర్లు ట్రిప్ కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.సెక్షన్ల వారీగా డీపీఆర్ రిపోర్టును ఆన్‌లైన్ చేయాలన్నారు. తనిఖీల్లో డిప్యూటీ ఈఈ కె.రాజశేఖర్, కొల్లిపర మండల ఏఈ పి.ప్రదీప్‌కుమార్, ఆయా గ్రామాల లైన్‌మెన్లు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

సాంస్కృతిక వారధి స్వరలయ వేదిక



సినీనటి సౌందర్యకు సత్కారం(ఫైల్)



మలేషియా తెలుగు ఉత్సవాల్లో సత్కారం(ఫైల్)

- 16న ఘనంగా రజతోత్సవాలు



సాయి లక్కరాజు రచనలు

తెనాలి: స్వరం...లయ కలిసిన వేదిక అర్థం వచ్చేలా నామకరణం చేసిన పట్టణానికి చెందిన స్వరలయ వేదిక సంగీతం, నృత్యంతో సహా లలిత కళల ప్రచారంలో విశిష్టత కలిగిన సంస్థగా గుర్తింపును సాధించింది. రెండున్నర దశాబ్దాల్లో 372 సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించింది. రజతోత్సవ వేడుకలను ఈ నెల 16న వైభవంగా నిర్వహించనుంది. కళా ప్రదర్శనలు, ప్రతిభా పురస్కారాలు, కళా రంగంలోని ప్రముఖులకు సత్కారాలు వేడుకల్లో భాగం. మరీ ముఖ్యంగా ప్రముఖ సినీనటి, నర్తకి మంజుభార్గవికి అదే వేదికపై జీవనసాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేయనుండటం మరో విశేషం.

స్వరలయ వేదిక వ్యవస్థాపకుడు సాయి లక్కరాజు. వృత్తిరీత్యా బ్యాంకు ఉద్యోగి. బహుముఖ ప్రజ్ఞాశాలి. ప్రవృత్తి రచనా వ్యాసంగం, కళలపై వ్యామోహం. సంభాషణల్లో ఛలోక్తులు, చమత్కారాల మెరుపులు నిత్యకృత్యం. సంగీత ప్రచారంలో పేరెన్నికగన్న తెనాలిలోని సద్గురు సంగీత సభ గాత్ర కచేరీకి వెళ్లటం, స్వరలయ వేదికకు ప్రేరణగా నిలిచిందంటారు. సంస్థ పేరు 'వేదిక' అనుకోగా, ప్రముఖ పాత్రికేయుడు పొత్తూరు వెంకటేశ్వరరావు 'స్వర'ను, నాట్యం తెలిసిన సతీమణి లలిత 'లయ'ను చేర్చారు. సినీ సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణిచే 1999లో స్వరలయ వేదిక ప్రారంభమైంది. ఉగాది పురస్కారాలు, ప్రతిభావంతులైన కళాకారులకు వేదికను కల్పించటం, పేదకళాకారులకు ఆర్థికచేయూత, తెలుగు భాష పరిరక్షణలో భాగంగా వేమన, సుమతి శతకాలను విద్యార్థులకు ఉచిత పంపిణీ, ప్రతిభా అవార్డులు, నాటకం, నాట్యం, సంగీతం కార్యక్రమాల నిర్వహణతో కళలకు, కళాకారులకు తగిన వేదికగా కొనసాగుతోంది. 2002లో సినీనటి సౌందర్యకు జీవన సాఫల్య పురస్కారం, నటుడు కోట శ్రీనివాసరావుకు గోవిందరాజుల అవార్డు, గజల్ శ్రీనివాస్ కచేరీ, కుర్తాళం పీఠాధిపతి సమక్షంలో భువన విజయం, మేడసాని మోహన్‌తో అష్టావధానం, మాడుగుల నాగఫణిశర్మచే అశుకవితా విలాసం, హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ నాటక సంస్థచే 'దొంగసత్తెయ్య' నాటక ప్రదర్శన వీటిలో కొన్ని. అరవై మంది సినీకళాకారులు, పదుల సంఖ్యలో సాహితీవేత్తలు స్వరలయ కార్యక్రమాలకు హాజరయ్యారు. మరోవైపు తెలుగు భాషా సేవలో భాగంగా 2002లో ప్రపంచ తెలుగు సమాఖ్య కార్యవర్గ సభ్యులుగా ఎన్నిక, నేటికీ కొనసాగుతూ ఉన్నారు. సమాఖ్యతోపాటు వివిధ దేశాల్లోని తెలుగు సంస్థల ఆహ్వానంపై ఇప్పటికి తొమ్మిది దేశాలను సందర్శించారు. మలేషియాకు తెలుగువాళ్లు కాలుమోపి 150 ఏళ్లయిన సందర్భంగా అక్కడ జరిపిన మహా సభల్లో వివిధ రంగాల ప్రముఖులతోనూ తననూ సత్కరించటం మరువలేని అనుభూతిగా సాయి లక్కరాజు చెబుతారు. లయన్స్ క్లబ్‌లో ఉత్తమ అధ్యక్షుడిగా పలుసార్లు అవార్డులు అందుకున్నారు. లాఫింగ్ క్లబ్, తెలుగు భాషోద్యమ సమితి సంస్థలతో వివిధ కార్యక్రమాలు చేస్తూ వచ్చారు. బ్యాంకు అధికారిగా రిటైరయ్యి స్వరలయ ప్రొడక్షన్స్‌ను స్థాపించి షార్ట్ ఫిల్మ్‌లు తీస్తున్నారు. తన దర్శకత్వంలో 'భువన విజయం' ప్రదర్శించి, అందులో రాయలుగా నటించారు. రచనా రంగంలో ప్రవేశించి హృదయ స్వరలయలు (గేయ సంపుటి), హృదయ కవనాలు (కవితా సంపుటి), కితకితలు (వ్యంగాస్త్రాలు), వీక్షణం (వ్యాస సంపుటి), 365 రోజులు నవ్వులే (నవ్వుల సంపుటి), కళా వెలుగులు (కళాకారుల పరిచయం), విహారం, మన పండుగలు, విశ్వంలో విజేతలు వంటి పుస్తకాలను వెలువరించారు. కేరింతలు (తెలుగు గజళ్లు), గృహవైద్యం పుస్తకాలు ముద్రణకు సిద్ధంగా ఉన్నాయి. సాంస్కృతిక, భాషా సేవలకు గాను రాష్ట్రీయ వికాస్ శిరోమణి, సాంస్కృతిక కేసరి బిరుదులతోపాటు ఢిల్లీ తెలుగు అకాడమీ ఉగాది పురస్కారం, ముంబయి తెలుగు అసోసియేషన్, ఢిల్లీ తెలుగు సంఘం, సింగపూర్, దుబాయ్ తెలుగు సంఘాలు, ప్రపంచ తెలుగు సమాఖ్య, మలేషియా తెలుగు సంఘం సత్కారాలను స్వీకరించారు.

మురుగు కాల్వల ఆక్రమణలు తొలగించండి

- మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక



స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న చైర్‌పర్సన్ రాధిక

తెనాలిఅర్బన్: మురుగు కాల్వలపై ఉన్న ఆక్రమణలను ఇళ్ల యజమానులు, షాపుల నిర్వాహకులు వెంటనే తొలగించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక సూచించారు. పట్టణంలోని 29వ వార్డులో గురువారం ఆమె పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుధ్య పనులు పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. స్థానికులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ వ్యర్థాలను మురుగు కాల్వలో, రోడ్లపై వేయవద్దని సూచించారు. వాటిని పారిశుధ్య కార్మికులకు అందజేయాలని చెప్పారు. దీంతో మురుగు కాల్వలు శుభ్రంగా ఉండటంతో పాటు నీరు నిలచిపోకుండా ఉంటుందన్నారు. తద్వారా దోమల వ్యాప్తి కూడ తగ్గుతుందని చెప్పారు. ఆమె వెంట కౌన్సిలర్ రమావత్ కవితాబాయి, మున్సిపల్ ఆరోగ్యాధికారిణి డాక్టర్ హెలెన్ నిర్మల, వైఎస్సార్ సీపీ నాయకులు తాడిబోయిన రమేష్, ఏసీపీ సుబ్బారావు, ఆర్ఐ మోహనకృష్ణ, ఏఈ రాజు తదితరులున్నారు.

కుసుమ హరనాథ మందిరంలో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

తెనాలిటౌన్: గాంధీ నగర్‌లోని కుసుమ హరనాథ మందిరంలో మాతృశ్రీ కుసుమ కుమారి 153వ జన్మదినోత్సవం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. అభిషేకాలు నిర్వహించారు. ఉదయం 5.30 గంటల నుంచి సాయంత్రం 5.45గంటల వరకు జయ హరనాథ్- జయ కుసుమ కుమారి అను పంచాక్షరి నామంతో అత్తోటకు చెందిన భక్త బృందం సభ్యులు భక్తి కీర్తనాలు జరిపారు. కుసుమకుమారికి కేక్ కట్ చేసి భోగిపండ్లు పోశారు. కార్యక్రమంలో మందిర ప్రెసిడెంట్ నరసింహారావు, జయహరనాథ్, ఆర్.సరళా రాణి, సుజాత మోహనరావు, ఎస్వీయోగ కన్వీనర్ ఎం.రమణయ్య, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

గర్భిణులు ముహూర్తాల కోసం వేచి ఉండటం ప్రమాదం

గుంటూరు మెడికల్: గర్భిణులు నొప్పులు భరించలేకపోవడం, ముహూర్తల పేరుతో శస్త్ర చికిత్సల కోసం తాపత్రయం పడుతుండటం బాధాకరమని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా బాలల సత్వర చికిత్స కేంద్రం ఆధ్వర్యంలో గురువారం ఆసుపత్రి శుశ్రుత హాలులో నెలలు నిండకుండా పుట్టిన పిల్లలకు, బరువు తక్కువ పిల్లలకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ నాగరికత పెరుగుతున్న సమాజంలో ముహూర్తం పెట్టుకుని పిల్లలకు జన్మనిచ్చేందుకు తల్లులు సిద్ధపడుతుండటం విచారకరమన్నారు. దానివల్ల అనేక దుష్పరిణామాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. ప్రకృతి పరంగా శిశువు జన్మనిస్తే ఆరోగ్యవంతంగా ఉంటారని చెప్పారు. సాధారణ శస్త్ర చికిత్సల వల్ల శిశువులు ఆరోగ్యంగా పుడతారని, ఈ విషయాన్నీ తల్లిదండ్రులు గమనించాలని ఆయన సూచించారు. నెలలు నిండకుండా శిశువులు జన్మనిస్తే ఆరోగ్యవంతంగా ఉండటం కష్టమని చెప్పారు. వ్యాధులు, వైకల్యంతో బాధపడతారని వెల్లడించారు. జిల్లా బాలల సత్వర చికిత్స కేంద్రం చిన్నారులకు వైద్య సేవలు సత్వరంగా అందించేందుకు కృషి చేయాలని ఆయన సూచించారు. నెలలు నిండిన గర్భిణులు ప్రసవం తర్వాత శిశువులు ఆరోగ్యంగా ఉంటారని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో సివిల్ సర్జన్ ఆర్ఎంవో డాక్టర్ బత్తుల వెంకట సతీష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ కె. ఆశా సజని పాల్గొన్నారు.

లింగ వివక్ష లేని సమాజ నిర్మాణమే ధ్యేయం



ర్యాలీ చేస్తున్న డ్వాక్రా మహిళలు

కొల్లిపర: లింగ వివక్ష లేని సమాజ నిర్మాణమే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని ఏపీఎం ప్రియదర్శిని అన్నారు. గురువారం వల్లభాపురం, మున్నంగి, కొల్లిపర, తూములూరు గ్రామాల్లో జండర్ క్యాంపెయిన్, రక్త హీనత పై డ్వాక్రా యానిమినేటర్లు అవగాహన కార్యక్రమం చేపట్టారు. అనంతరం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించి, నినాదాలు చేశారు. ఏపీఎం మాట్లాడుతూ.. మహిళలు పురుషులతో సమానంగా ముందడుగు వేస్తున్నారని, వారిలో మరింత చైతన్యం నింపాలనే ఉద్దేశంతో ఇటు వంటి కార్యక్రమాలు ప్రభుత్వాలు చేపడుతున్నట్లు తెలిపారు. మహిళా చట్టాలపై అవగాహన పెంచుకుని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళాభివృద్ధికి అనేక పథకాలు అమలు చేస్తోందని వివరించారు. దిశ యాప్, మహిళా హెల్ప్‌లైన్ 100, 181, 1098, 101 నెంబర్లను ప్రతి మహిళా గుర్తుపెట్టుకొని అత్యవసరమైన సమయంలో ఉపయోగించుకోవాలన్నారు. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డ్వాక్రా మహిళలు, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

మైనరే లీడర్‌గా చోరీలు

- రాత్రిళ్లు మూసి ఉన్న దుకాణాలే టార్గెట్
- నలుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- ప్రధాన నిందితుడిగా మైనర్ బాలుడు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాసరెడ్డి, పక్కన ఎస్ఐ వెంకటేశ్వర్లు

తెనాలిరూరల్: వ్యసనాలకు బానిసలై దుకాణాల్లో చోరీలకు పాల్పడుతున్న నలుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరిలో ప్రధాన నిందితుడు మైనర్ కావడం విశేషం. తెనాలి రూరల్ పోలీస్ స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రూరల్ సీఐ కడప శ్రీనివాసరెడ్డి వివరాలను వెల్లడించారు. గుంటూరుకు చెందిన ఓ మైనర్ బాలుడితో పాటు భవాని శంకర్(నల్లచెరువు), పరిమి అనిల్‌కుమార్ అలియాస్ బ్రిటీష్(డీఎస్ నగర్), చింతా చైతన్య అలియాస్ చింతకాయ్(యాదవ వర్కర్స్ కాలనీ) స్నేహితులు. వ్యసనాలకు బానిసలైన వీరు చోరీలకు పాల్పడడం అలవర్చుకున్నారు. ఈ క్రమంలో కొద్ది కాలంగా తెనాలి మండలం కొలకలూరు, నందివెలుగు, సంగం జాగర్లమూడి గ్రామాల్లోని దుకాణాల్లో రాత్రిళ్ల చోరీలకు పాల్పడ్డారు. దుకాణాల తాళాలు పగులగొట్టి వాటిలోని సిగరెట్ బండిల్స్, ఆయిల్, బిస్కెట్ ప్యాకెట్లు, టెంట్ హౌస్‌లలో ఉన్న సామగ్రి, బియ్యం బస్తాలను(సుమారు రూ. రెండు లక్షల విలువైన సొత్తు) అపహరించు కెళ్లారు. చోరీల గురించి సమాచారం అందుకున్న రూరల్ ఎస్ఐ సీహెచ్. వెంకటేశ్వర్లు ప్రత్యేక బృందంతో దర్యాప్తు చేపట్టారు. తెనాలి మండలం నందివెలుగు ప్రధాన కూడలి వద్ద నిందితులను అదుపులోకి తీసుకుని, వారిచ్చిన సమాచారం మేరకు చోరీ చేసిన సొత్తును రికవరీ చేశారు. అలానే చోరీలకు వినియోగించిన ఆటో, స్కూటీలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో మైనర్ బాలుడిని జువెనైల్ హోంకు తరలించామని, మిగిలిన ముగ్గురిని కోర్టులో హాజరుపరచినట్టు సీఐ తెలిపారు. చోరీ కేసులను చేధించిన ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఏఎస్ఐ ఎ. పోతురాజు, కానిస్టేబుళ్లు పి. శ్రీనివాసులు, ఎం.రాము, పి.లక్ష్మీకాంత్‌లను సీఐ అభినందించారు.

అగ్నిప్రమాదంలో పూరిళ్లు దగ్ధం

- సుమారు రూ.5లక్షల ఆస్తినష్టం



దగ్ధమవుతున్న పూరిళ్లు

నగరం: అగ్ని ప్రమాదంలో మూడు పూరిళ్లు దగ్ధమై సుమారు రూ.5లక్షల ఆస్తి నష్టం వాటిల్లిన ఘటన మీసాలవారిపాలెంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మీసాలవారిపాలెం ఎస్టీ కాలనీలో గురువారం మూడు పూరిళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఎస్టీ కాలనీలోని కొమరగిరి దుర్గ ఇంటి నుంచి మంటలు చెలరేగి పక్కనే ఉన్న కోనేటి నాగలక్ష్మి, కోనేటి సత్యవతి పూరిళ్లకు వ్యాపించాయి. స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. వారు మంటలను ఆదుపుచేశారు. అయితే అప్పటికే మూడు పూరిళ్లు, సామగ్రి పూర్తిగా దగ్ధమయ్యాయి. అగ్నిప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. సర్పంచ్ చింతల సుబ్బారావు, వీఆర్వో సుధాకర్ వచ్చి భాదితులను పరామర్శించి, అండగా ఉంటామని హామీనిచ్చారు.

నమూనా ఓటుపై విస్తృత ప్రచారం

తాడేపల్లిరూరల్: మంగళగిరి నియోజకవర్గంలోని ఓటర్లను అవగాహన పరిచేందుకు నమూనా ఓటు ప్రకియ కొనసాగుతోంది. గురువారం విలేకరుల సమావేశంలో మంగళగిరి రూరల్ ఏఈఆర్ఓ జీవీ రామ్‌ప్రసాద్ మాట్లాడుతూ తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేసి నమూనా ఓటుపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈవీఎం పై ఓటు వేసేటప్పుడు కేంద్రంలో ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉన్నప్పుడు ఎటువంటి ఇబ్బందులు ఎదురు కాకుండా ఉండేందుకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఓటు వేసే సమయంలో టెన్షన్‌కు గురై తన ఓటు ఎటుపడిందోనని సందేహాలు లేకుండా ఉండేందుకు మాక్ పోలింగ్ ఓటు వేయవచ్చని అన్నారు. ఈవీఎం వీవీ ప్యాట్ తదితర విషయాలపై అవగాహన పెంచుకోవచ్చన్నారు. ఓటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పోయిన బ్యాగ్‌ను అప్పగించిన పోలీసులు



పట్నంబజారు: బ్యాగ్ పోగొట్టుకున్న మహిళకు ట్రాఫిక్ పోలీసులు తిరిగి అప్పజెప్పిన ఘటన గుంటూరు నగరంలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ ఈస్ట్ ఎస్ఐ షరీఫ్ తెలిపిన వివరాల ప్రకారం... వింజనంపాడు గ్రామానికి చెందిన ఓ మహిళ గురువారం గుంటూరు మార్కెట్‌కు వచ్చింది. ముందుగా బ్యాంకుకు వెళ్లి బంగారు ఆభరణాలు తాకట్టుపెట్టి రూ. 2 లక్షల నగదు, కొంత బంగారంతో మార్కెట్‌కు వచ్చి పనులు చూసుకుని ఆటోలో వెళుతుండగా చేతి బ్యాగ్ తెగి కింద పడిపోయింది. గమనించిన ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ వెంకట్రావు, కానిస్టేబుల్ శ్రీనివాసరావు విషయాన్ని ఎస్ఐ షరీఫ్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో మహిళ ఆచూకీ గుర్తించిన పోలీసులు ఆ బ్యాగును తిరిగి ఆమెకు అందజేశారు.